RNI : APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్ | శనివారం 14 డిసెంబర్ 2024 | సంపుటి : 12 | సంచిక : 316 | పేజీలు : 8 | వెల : 4/-



గుకేశ్‌కు తమిళనాడు సీఎం రూ.5కోట్ల నజరానా

5 లో..

## నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

- పెండింగ్ లో ఉన్న రూ.1800 కోట్లు తక్షణమే ఇవ్వండి
- ఏపీ నుండి వచ్చే రూ.408 కోట్లను ఇప్పించండి
- రూ. 2,547.07 కోట్ల రికవరీ ఆదేశాలు ఏకపక్షంగా ఉన్నాయి
- మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలి
- నిర్మలా సీతారామన్ ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు



తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సంధర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం చొరవ చూపాలని సీఎం ప్రత్యేకంగా కేంద్రాన్ని కోరారు.

మిగతా 2 లో



# చంచల్‌గూడ జైలులోనే పుష్పరాజ్

## సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌పై ఏ11గా కేసు నమోదు

### 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి న్యాయస్థానం

- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- సాయంత్రం మధ్యంతర బెయిలిచ్చిన హైకోర్టు
- నేడు విడుదలయ్యే అవకాశం

**హైదరాబాద్, డిసెంబర్ 13 :** పుష్ప-2 సినిమా ప్రదర్శన సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌లో ఈ నెల 4వ తేదీ రాత్రి జరిగిన తొక్కిసలాట వల్ల ఓ మహిళ మృతి చెందిన కేసులో సినీ నటుడు అల్లు అర్జున్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంత రం మధ్యంతర బెయిలు మంజూరు పరిణా మాలతో ఉత్కంఠ నెలకొంది. తొలుత నాంపల్లి న్యాయ స్థానం రిమాండ్ విధించగా.. చంచల్ గూడ జైలుకు తరలించారు. అనంతరం హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. కానీ సంబంధిత పత్రాలు జైలు అధికారులకు రాత్రి 10.30 గంటలకు అందడంతో అర్జున్‌ను శుక్రవారం చంచల్‌గూడ జైల్లోనే ఉంచారు. శనివారం ఉదయం ఆయ నను విడుదల చేయనున్నట్టు జైలు అధికారులు తెలిపారు. అర్జున్‌తో పాటు సంధ్య థియేటర్ యజమానులిద్దరికి కూడా మధ్యంతర బెయిలు మంజూరైంది.

మిగతా 2 లో



## చట్టం అందరికీ సమానం

- కేసు పెట్టకపోతే మమ్మల్ని ప్రతి ఒక్కరూ అడిగేవారు
- అల్లుఅర్జున్ హంగామా చేయకపోతే ఇంతదాకా వచ్చేదే కాదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : మనదేశంలో సాధారణ పౌరుడి నుంచి ప్రధాని వరకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తిస్తుంది. దానికి అనుగుణంగానే చట్టం పనిచేస్తుంది" సినీనటుడు అల్లు అర్జున్ సినిమా థియేటర్‌కు వచ్చి ఎలాంటి హంగామా చేయకుండా, సినిమా చూసి వెళ్లిపోయి ఉంటే ఇంత గొడవ అయ్యేది కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు

కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదం

2



## పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

- ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి
- వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం
- రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్
- న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

2




## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు

ఫోర్బ్స్ 2024 జాబితా విడుదల





## అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్

- అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్
- భూమిని ఢీకొట్టబోతున్న ఆస్టరాయిడ్?
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

2 లో..

# 47 ఏళ్లుగా అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నా..



- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**సత్తుపల్లి, డిసెంబర్ 13 :** నా రాజకీయ జీవితంలో 47 ఏళ్లుగా దమ్మపేట అశ్వరావుపేట ప్రాంతాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశానని, ఆది నుంచి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ఎజెండాగా ముందుకు సాగుతున్నానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం దమ్మపేట మండలంలో అల్లిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ భవనం,రూ. 29 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రహదారితో పాటు కల్వర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

మిగతా 2 లో



## ఎర్రకోటను అప్పగించాలని మొఘల్ వారసుల పిటిషన్

### పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, డిసెంబర్13 :** ఎర్రకోటను తమకు అప్పగించాలని కోరుతూ మొఘల్ వారసులు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఎర్రకోటను తమ పూర్వీకులు నిర్మించారని, దానిని ప్రభుత్వం తమకు ఇచ్చేయాలంటూ మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 మునిమనుమడి భార్య సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులో 2021లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు దానిని కొట్టివేసింది.




## ఏపీ దశ దిశను మార్చేలా స్వర్ణాంధ్ర-2047 విజన్

- తెలుగు జాతిని ఉన్నత స్థానంలో నిలపడమే లక్ష్యం
- ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోన్న భారత్
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

3 లో..

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తూ.. విజన్ డాక్యుమెంట్ తీసుకురావడం తమ అకుంఠిత దీక్షకు నిదర్శనమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ మహాసంకల్పంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. చారిత్రక సమావేశానికి హాజరైన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

(మొదటిపేజీ తరువాయి)

రాజస్థాన్ పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ప్రధానంగా తెలంగాణ నిధులు, రైల్వే ప్రాజెక్ట పూర్తి, పలు అంశాలపై సీఎం రేవంత్ సుధీర్ఘ చర్చలు జరిపారు. కేంద్ర రైల్వేశాఖ ముంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ కాగా, పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చించారు. అందులో కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, వికారాబాద్ - కృష్ణ స్టేషన్ల మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలుమార్గం నిర్మించాలని కోరారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ కాగా కీలక అంశాలపై చర్చ సాగింది. వెనక బడిన జిల్లాలకు పునర్విభజన చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను వెంటనే తెలంగాణకు విడుదల చేసేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. నాలుగేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లను ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పించాలని కేంద్రాన్ని కోరారు. విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుండి ఏకపక్షంగా రూ. 2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్ష ఆదేశాల పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు సీఎం. అలాగే ఈ విషయంలో మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సీఎం అందజేశారు. అయితే కేంద్రాన్ని సీఎం కోరగా, సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా తెలంగాణ పట్ల వివక్షత చూపకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చూడాలని సీఎం కోరారు. సీఎం వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా భేటీలలో పాల్గొని తమ వాణి వినిపించారు.

# ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు


**కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదం**

**హైదరాబాద్,డిసెంబర్ 13(ఆర్ఎన్ఎ):** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆయనను విచారించేందుకు సన్నద్ధం అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా గతేడాది ఫిబ్రవరిలో ఫార్ములా ఈ-కారు రేస్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఫార్ములా ఈ-కారు రేసు నిధుల కేటాయింపులలో భారీ అవినీతి జరిగినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంస్థ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటికే ఉన్న ఇద్దరు పురపాలక శాఖ అధికారులతో పాటు అప్పట్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు అధికారులపై విచారణకు అనుమతించింది. అలాగే ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు కోసం అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. దీనిపై న్యాయ సలహా మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేటీఆర్‌ను విచారించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

# అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్

**భూమిని ఢీకొట్టబోతున్న ఆస్టరాయిడ్?**

**ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వెల్లడి**



**న్యూఢిల్లీ,డిసెంబర్13 :** అంతరిక్షంలో తిరుగుతున్న ఒక భారీ ఆస్టరాయిడ్ భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆ ఆస్టరాయిడ్ ఢీకొంటే దారుణమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ ఆస్టరాయిడ్ పై ఇస్రో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు వివరాలను ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ తాజాగా వెల్లడించారు. అంతరిక్షంలో తిరుగుతున్న ఆస్టరాయిడ్ అపోఫిస్ భవిష్యత్తులో భూమికి అత్యంత సమీపంగా వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. సుమారు 450 మీటర్ల పొడవు, 170 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆస్టరాయిడ్... 2029 ఏప్రిల్ 13న భూమికి అత్యంత దగ్గరగా అంటే.. కేవలం 32 వేల కిలోమీటర్ల సమీపం నుంచి దూసుకువెళుతుందని తేల్చారు. అంటే భూమి చుట్టూ స్థిర కక్ష్యలో తిరిగే కమ్యూనికేషన్ శాటిలైట్ల కంటే కూడా ఇది దగ్గరగా వస్తుండడం గమనార్హం. అపోఫిస్ మన యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య కంటే పెద్దదని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు. అపోఫిస్ భూమిని ఢీకొట్టే పరిస్థితి, దాని గమనం, ఇతర అంశాలపై ఇస్రోలోని 'నేత్ర (నెట్ వర్క్ ఫర్ స్పేస్ ఆబ్జెక్ట్ ట్రాకింగ్ అండ్ అనాలసిస్)' విభాగం ఆధ్వర్యంలో పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో నాసాకు చెందిన ఒసిరిస్ ఆర్ఈఎక్స్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రామ్సెస్ విభాగాలతో ఆస్టరాయిడ్లపై పరిశోధనలో కలసి ముందుకువెళుతున్నట్టు వివరించారు.

# చంచల్‌గూడ జైలులోనే పుష్పరాజ్

(మొదటిపేజీ తరువాయి)

అర్జున్ రూ.50 వేల వ్యక్తిగత బాండ్‌ను చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌కు అందజేయాలని హైకోర్టు ఆదేశిం చింది. అర్నబ్ గోస్వామి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, భజన్‌లాల్ కేసులను ప్రస్తావిస్తూ మధ్యంతర బెయిలు మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిత్ర కథానాయకుడు రాబోతున్నందున తగిన బందోబస్తు కల్పించాలంటూ సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు వినతిపత్రం ఇవ్వడం, దాన్ని ఆమోదిస్తూ.. పోలీసు అధికారులు స్టాంపు వేసిన విషయాలనూ పరిగణనలోకి తీసుకున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగించవచ్చని, అందులో పిటిషనర్లు జోక్యం చేసుకోరాదని, పోలీసులకు సహకరించాలని సూచించారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేసేందుకు గురువారమే ప్రయత్నించినా.. ఆయన దిల్లీ వెళ్లినట్లు తెలుసుకుని వెనక్కి వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చిక్కడపల్లి ఏసీపీ రమేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిలు అర్జున్ నివాసానికి చేరుకున్నారు. ఈత కొలను వద్ద ఫోన్ మాట్లాడుతున్న ఆయన వద్దకు వెళ్లి.. అరెస్టు చేస్తున్నట్టు తెలిపారు. దుస్తులు మార్చుకునేందుకు అవకాశమివ్వాలని కోరగా.. అర్జున్ వెంట పోలీసులు ఆయన గది వద్దకు వెళ్లారు. తలుపులు మూయకుండానే దుస్తులు మార్చుకోవాలని పోలీసులు ఆయనకు స్పష్టం చేశారు. అనంతరం దుస్తులు మార్చుకుని బయటకు వచ్చిన అల్లు అర్జున్.. ఏసీపీ రమేశ్‌కుమార్ ఎదుట అసహనం వ్యక్తం చేశారు. 'పోలీసులకు నేను సహకరిస్తాను. కానీ పోలీసులు బెడ్‌రూమ్ వరకూ రావటం మంచిది కాదు' అని అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్జున్ అరెస్టు సమయంలో భార్య స్నేహారెడ్డి, సోదరుడు శిరీష్, తండ్రి అరవింద్ పక్కనే ఉన్నారు. అర్జున్ తన భార్య స్నేహారెడ్డికి ధైర్యం చెప్పి బయలుదేరారు. పోలీసులు తమ వాహనంలో ఆయనను చిక్కడపల్లి స్టేషన్‌కు తరలించగా.. వెనుక మరో వాహనంలో అరవింద్ అనుసరించారు. సినీ నిర్మాతలు దిల్‌రాజు, బన్నీవాసు, అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, సోదరుడు శిరీష్, తండ్రి అల్లు అరవింద్ తదితరులు చిక్కడపల్లి ఠాణాలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదు. అర్జున్ వాంగ్మూలం తీసుకున్న తర్వాత పోలీసులు ఆయనను వైద్యపరీక్షల కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు ఈసీజీ, బీపీ, షుగర్, కొవిడ్ పరీక్షలు చేయగా.. సాధారణ ఫలితాలు వచ్చాయని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అనంతరం అర్జున్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపరచగా.. ఇరుపక్షాల మధ్య సుమారు రెండు గంటలసేపు వాడివేడి వాదనలు జరిగాయి. విచారణ జరిగే బెంచ్ వద్దకు ఎక్కువ సంఖ్యలో న్యాయవాదులు రావడం, గందరగోళం నెలకొనడంతో న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాదోపవాదాల అనంతరం అర్జున్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. అర్జున్ అరెస్టు నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.

**కేసు ఉపసంహరించుకుంటా : రేవతి భర్త భాస్కర్**

తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి భర్త భాస్కర్.. అల్లు అర్జున్ అరెస్టుపై స్పందించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడు సినిమా చూస్తానంటే ఆ రోజు సంధ్య థియేటర్‌కు తీసుకెళ్లానని, ఈ ఘటనలో అర్జున్ తప్పేమీ లేదని, తొక్కిసలాట ఘటనతో ఆయనకు సంబంధం లేదని పేర్కొన్నారు. తాను కేసును ఉపసంహరించుకుంటానని, అర్జున్‌ను జైలు నుంచి విడుదల చేయాలని కోరారు.

# చట్టం అందరికీ సమానం

- **కేసు పెట్టకపోతే మమ్మల్ని ప్రతి ఒక్కరూ అడిగేవారు**
- **అల్లుఅర్జున్ హంగామా చేయకపోతే ఇంతదాకా వచ్చేదే కాదు**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 13 :** ఢిల్లీలో శుక్రవారం ఇండియా టుడే గ్రూపు ఆజ్‌తక్ నిర్వహించిన చర్చావేదికలో పాల్గొన్న ఆయన అల్లు అర్జున్ అరెస్టు ఘటనపై స్పందించారు. "పుష్ప-2 విడుదల సందర్భంగా బెనిఫిట్ షోకు మేమే అనుమతిచ్చాం. రూ.300 ఖరీదైన టికెట్‌ను రూ.1,300 కి పెంచుకోవటానికి సమ్మతించాం. అల్లు అర్జున్ సినిమాను చూడాలనుకుంటే స్టూడియోలో స్పెషల్ షో వేసుకోవచ్చు. ప్రేక్షకులు, అభిమానులతో కలిసి చూడాలనుకుంటే పోలీసులకు, మేనేజ్‌మెంట్‌కు ముందస్తు సమాచారం ఇవ్వాలి. అలాగాకుండా ఈ ప్రదర్శన జరుగుతున్న థియేటర్ వద్దకు ఆయన సడెన్‌గా వచ్చారు. ఆయన్ని చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆయన కారులో నుంచి బయటకి వచ్చి, చేతులు ఊపుతూ ర్యాలీగా అభివాదం చేస్తూ వెళ్లారు. అక్కడ తొక్కిసలాట జరగడంతో ఒక మహిళ మృతి చెందారు. ఆమె తొమ్మిదేళ్ల కుమారుడు తీవ్రంగా గాయపడి, చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? అల్లు అర్జున్ ఎలాంటి హంగామా లేకుండా వచ్చి సినిమా చూసుంటే ఈ గొడవయ్యేదే కాదు. ఈ క్రమంలో పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి, ఆయన్ని ఏ-11 కింద చేర్చారు. థియేటర్ యాజమాన్యం ప్రతినిధులను అరెస్టు చేశారు. పదిరోజుల తర్వాత అల్లు అర్జున్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దాంతో సినిమా నటుడిని కావాలనే అరెస్టు చేశారని చర్చ మొదలుపెట్టారు. ఆయన సినిమా స్టారా? పొలిటికల్ స్టారా? అన్న విషయాన్ని ప్రభుత్వం చూడదు. నేరం ఎవరు చేశారనదే చూస్తుంది" అని సీఎం అన్నారు..



# పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

- **ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి**
- **వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం**
- **రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్**
- **న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు**

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. పార్టీల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. హైదరాబాద్ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. తాగి వాహనం నడిపితే 10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిపైనా కేసు నమోదు చేస్తామన్న పోలీసులు.. ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# 47 ఏళ్లుగా అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నా..

(మొదటిపేజీ తరువాయి)



అనంతరం అల్లిపల్లి గ్రామంలో గ్రామస్తులు స్వయంగా నిర్మించుకున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో ఎన్నో పదవులను కట్టబెట్టిన సొంత మండలం దమ్మపేట అభివృద్ధి కోసం ఆది నుంచి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. దమ్మపేట, అశ్వరావుపేట ప్రజల ఆశీర్వాదం వల్లనే ఈరోజు అన్ని ప్రభుత్వాల్లో మంత్రిగా కొనసాగే భాగ్యం కలిగిందన్నారు. ఇక్కడి రైతులు పామాయిల్ రంగంలో రాణిస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ ప్రాంతాల అభివృద్ధిని చూసి పక్క రాష్ట్ర ప్రజలు సైతం మెచ్చుకుంటున్నారని, దమ్మపేటను ఆ రోజుల్లోనే ఆదర్శంగా తీర్చిదిద్దామని స్వయంగా ఎన్టీ రామారావు అభినందించారని చెప్పారు. ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని గిరిజనుల భూముల్లో గిరిజనలే వ్యవసాయం చేసుకోవాలని, గిరిజనేతరులు సాగు చేయడానికి వీలులేదని అన్నారు. ఇక్కడ రైతులు ఎవరి భూముల్లో వారే సాగు చేసుకుంటున్నారని వాటికి హక్కు కల్పించాల్సిన అవసరం అధికారులకు ఉందన్నారు. దశాబ్దాలుగా రాజకీయ రంగంలో కష్టపడి పని చేస్తూ ప్రజలకు కావలసిన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులను కల్పించి వారి అవసరాలను తీర్చానని మంత్రి అన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధి కోసం మరిన్ని నిధులను తీసుకువచ్చి ప్రతి మారుమూల గ్రామానికి రహదారి సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఆయన అన్నారు. అనంతరం అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా రైతులకు అవసరమైనటువంటి గ్రావెల్ రోడ్లు, మెటల్ రోడ్లు వేయడానికి గాను సుమారు 25 కోట్ల 66 లక్షల 48 వేల 375 రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మంజూరు అయిన పనులు అన్నిటిని మార్చి నెల లోపల పూర్తి చేయాలన్నారు. ఇంకా ఎవరైనా రైతులు తమ పొలాలకు వెళ్ళు పొలం బాట అవసరమైనచో సంబంధిత ఎంపీడీవో కార్యాలయం లేదా పంచాయతీ కార్యాలయాల్లో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేయాలని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి ,కొత్తగూడెం ఆర్డీవో మధు, పంచాయతీరాజ్ కాశయ్య,ఆలపాటి ప్రసాద్ మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రకోటను అప్పగించాలని మొఘల్ వారసుల పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)

గతంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తమ పూర్వీకుల నుంచి అక్రమంగా తీసుకున్న ఎర్రకోటను తమకు అప్పగించాలని అందులో పేర్కొన్నారు. మొదటి స్వాతంత్ర్య యుద్ధం అనంతరం మొఘలుల ఆస్తులు, ఎర్రకోట వంటి కట్టడాలను బ్రిటిష్ వారు ఆక్రమించుకున్నారని, దీంతో దేశం విడిచి వెళ్లిపోయిన నాటి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-2 1862లో మృతి చెందినట్లు పిటిషన్‌లో తెలిపారు. వారు నిర్మించిన ఎర్రకోటను ప్రభుత్వం ఆక్రమించుకుందని పేర్కొన్నారు. తమ ఆస్తిని తిరిగి ఇప్పించాలని కోరారు. ఆస్తిని తమకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకుంటే అందుకు పరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... ఆమె అప్పీల్‌ను తోసిపుచ్చింది.

# ఇవి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కాదు

**ఈవీఎం ప్రభుత్వాలు : ఎంపీ సంజయ్‌రౌత్**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 :** జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఉద్ధవ్ థాకరే శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ తీవ్ర విమర్శలు చేశారు. జమిలి ఎన్నికల నిర్వహణపై సరైన పరిశోధన, సరైన సవరణలు జరగలేదని రౌత్ వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాక ప్రధాని నరేంద్రమోదీ 2029 వరకు పదవిలో కొనసాగుతాడనే నమ్మకం తనకు లేదని అన్నారు. 'జమిలి ఎన్నికలకు సంబంధించి సరైన సవరణలు, పరిశోధన జరగలేదు. ప్రధాని ఎప్పుడూ తన మనసులోని మాటలు చెబుతుంటాడు. కానీ ప్రజల మనసులో ఏముంది..? ప్రతిపక్షాల మనసులో ఏముంది..? అనే విషయాలను గురించి ఆయన ఆలోచించరు. మోదీ 2029 వరకు ప్రధానిగా కొనసాగుతారనేది నాకు అనుమానమే. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పు. కేంద్రంలో, మహారాష్ట్రలో ఏర్పాటైన మీ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కావు. అవి ఈవీఎంల ద్వారా ఏర్పాటైన ప్రభుత్వాలు' అని రౌత్ వ్యాఖ్యానించారు. మరోవైపు పలువురు కాంగ్రెస్ ఎంపీలు కూడా జమిలి ఎన్నికలపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అవకతవకలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలు జరగడంవల్ల ఎన్నికల ఖర్చు భారీగా తగ్గిపోయి దేశ జీడీపీ 1.5 వరకు పెరిగే ఛాన్స్ ఉందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ చెప్పడాన్ని కొందరు కాంగ్రెస్ ఎంపీలు తప్పుపట్టారు.

# 2030 నాటికి 20 గిగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తి

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** రాష్ట్రంలో 2030 నాటికి 20 గిగావాట్ల హరిత ఇంధనం (గ్రీన్‌పవర్) ఉత్పత్తి లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి మల్లు విక్రమార్క తెలిపారు. విద్యుత్తు పొదుపు, సమర్థత సాధన కోసం అన్ని రంగాల్లో టెక్నాలజీ సాయంతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా.. రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) రూపొందించిన విద్యుత్తు పొదుపు క్యాలండర్‌ను శుక్రవారం ప్రగతిభవన్‌లో ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 2035 నాటికి 40 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రగతిని టీజీరెడ్కో ఎండీ వావిల్ల అనిల మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ... 'ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమల్లో దేశంలోనే తెలంగాణ తొలిస్థానంలో ఉంది. దీంతో 879 వాణిజ్య భవనాల ద్వారా 392.21 మిలియన్ యూనిట్ల ఆదా జరిగింది. డిమాండ్ ఆధారిత నిర్వహణ (డీఎస్ఎం)తో హైదరాబాద్‌లో 40 మెగావాట్ల విద్యుత్తు పొదుపు చేయగలిగాం. రాష్ట్రంలోని 73 పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో 17.23 లక్షల వీధిదీపాలను ఎల్ఈడీకి మార్చాం. ప్రభుత్వ సంస్థల్లో పాత విద్యుత్తు ఉపకరణాలను ఎల్ఈడీకి మార్చడంతో 2.87 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా చేశాం. ఇప్పటికే మూడుసార్లు జాతీయ విద్యుత్తు పొదుపు అవార్డులు అందుకున్నాం' అని వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్కో జీఎం వీఎస్వీ ప్రసాద్, డీజీఎం వెంకటరమణ, ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ దశ దిశను మార్చేలా స్వర్ణాంధ్ర-2047 విజన్

- తెలుగు జాతిని ఉన్నత స్థానంలో నిలపడమే లక్ష్యం
- ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోన్న భారత్
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, డిసెంబర్ 13 :** అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తూ.. విజన్ డాక్యుమెంట్ తీసుకురావడం తమ అకుంఠిత దీక్షకు నిదర్శనమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ మహాసంకల్పంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. చారిత్రక సమావేశానికి హాజరైన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని అన్నారు. 2047లో మనం వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు జరపుకుంటామని, ఆ నాటికి భారతదేశం అగ్రదేశంగా మారాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ – 2047ను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని చంద్రబాబు వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్రం కూడా ఒక స్పష్టమైన లక్ష్యంతో స్వర్ణాంధ్ర–2047ను విజన్ డాక్యుమెంట్ రూపొందించుకుందని వ్యాఖ్యానించారు. 'పది సూత్రాల వృద్ధి సోపానాలతో విలువైన విజన్ సాక్షాత్కరించింది. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం–మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు–వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి–ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత మార్గదర్శక సూత్రాల నవపథం ఆవిష్కృతమైంది' అని చంద్రబాబు వివరించారు. 'నేను 1978 నుంచి అనేక ఎన్నికల్లో పోటీచేశాను. కానీ, 93 శాతం సక్సెస్ రేటు, 57 శాతం ఓటు బదిలీని 2024 ఎన్నికల్లో మాత్రమే చూశా. పవన్ కళ్యాణ్ వంటి మంచి మిత్రుడు ఉండటం చాలా సంతోషంగా ఉంది. పాలన చేపట్టాక చూస్తుంటే మా ఊహలకన్న ఎక్కువ విధ్వంసం జరిగిందని తెలిసింది. గాడితప్పిన పరిపాలనను చక్కదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. ప్రస్తుతం మన రాష్ట్రంలో తలసరి ఆదాయం మూడువేల డాలర్ల కంటే తక్కువగా ఉంది. 2047 నాటికి తలసరి ఆదాయాన్ని 42 వేల డాలర్లుకు చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా మేమందరం రాళ్లు మాత్రమే చూశాం. మీరు మాత్రం అందులో ఒక విజన్ చూశారని పవన్ కళ్యాణ్ ఎప్పుడూ అంటుంటార్న. ఆ రోజు అక్కడ ఒక సింగపూర్‌ను, దుబాయ్‌ను చూశా. న్యూయార్క్ వంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన చేసి, ముందుకెళ్లాను.

ఆనాడు చేసిన విజన్, పునాది కారణంగా హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో ఎక్కువ తలసరి ఆదాయం సంపాదించే రాష్ట్రంగా తయారైందని చెప్పడానికి గర్వంగా ఉంది' అని చంద్రబాబు చెప్పారు. 'మన దగ్గర మెరికల్లాంటి యువత ఉన్నారు. తిరుగులేని మానవవనరులు, సహజ వనరులు, నదులు, సముద్రతీరం ఉన్నాయి. వీటన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకుంటే ఏదైనా సాధ్యమే. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ ఉండాలనే లక్ష్యంతో పది సూత్రాలతో స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. సమాజమే దేవాలయం.. పేదలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్‌టీఆర్.. ఆ స్ఫూర్తితోనే నేడు జీరో పావర్టీ కోసం సంకల్పించాం' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# వర్సిటీల్లో ఆచార్యుల నియామకాలకు కమిటీ

## - ఉపకులపతుల సమావేశంలో ప్రభుత్వ నిర్ణయం



**హైదరాబాద్:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల నియామకాలు, ప్రస్తుతం పనిచేస్తున్న వారికి పదవీ విరమణ వయసు పెంపు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ద్వారా పదోన్నతులకు సంబంధించిన విధానాలను సూచించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించాలని నిర్ణయించింది. అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఘంటా చక్రపాణి ఛైర్మన్‌గా.. ఓయూ, మహాత్మాగాంధీ ఉపకులపతులు ఎం.కుమార్, అల్తాఫ్ హుస్సేన్, మరో ఇద్దరు నిపుణులు సభ్యులుగా ఉంటారు. శుక్రవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉపకులపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధనా సిబ్బంది నియామకానికి విధివిధానాల రూపకల్పనకు కమిటీని నియమించాలని నిర్ణయించారు. ప్రైవేటు కళాశాలలకు అనుబంధ గుర్తింపు జారీ, రాష్ట్ర విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానాన్ని కల్పించడం, నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలపై మరో కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో ఆచార్యుల ఖాళీలు, నిధుల కొరతపైనే దాదాపు ఉపకులపతులందరూ ప్రస్తావించారు. వేతనాల చెల్లింపులకు ఇబ్బందవుతోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ ఛార్జీల బకాయిలు విడుదల కావడం లేదని తెలిపారు. శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రధాన సమస్యలను సీఎంకు వివరించేందుకు డీపీఆర్‌తో రావాలన్నారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డిగ్రీ, ఇంజినీరింగ్ సిలబస్‌ను మార్చడానికి నాలుగు కోర్ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం ఉన్నత విద్యామండలి రూపొందించిన న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థినుల చదువు పూర్తయినా సర్టిఫికెట్లు వర్సిటీ పేరిట ఇవ్వలేకపోతున్నామని మహిళా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ సూర్యధనంజయ్ సమావేశంలో ప్రస్తావించగా... వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం బిల్లును ఈ శాసనసభ సమావేశాల్లోనే ప్రవేశపెడతామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ వెల్లడించినట్లు తెలిసింది. 2018 నవంబరులో అప్పటి బోధనా సిబ్బంది ఖాళీలను బట్టి తొలి విడతలో 1,060 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించి రోస్టర్ పాయింట్లు సిద్ధం చేశారని, ఇప్పుడు ఖాళీలు పెరిగినందున ఈ డిసెంబరు 31 నాటికి ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకోవాలని కొందరు వీసీలు కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం వర్సిటీల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసు 60 ఏళ్లు కాగా.. కాంట్రాక్టు సహాయ ఆచార్యులను మాత్రం 60 ఏళ్లు దాటినా కొనసాగించవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వర్సిటీలకు ఆదేశాలివ్వడంపై పలువురు ప్రశ్నించినట్లు సమాచారం.

## మంత్రివర్గ విస్తరణపై

# అధిష్ఠానంతో చర్చించలేదు

**: సీఎం రేవంత్‌రెడ్డి**



**ఢిల్లీ:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో తాను చర్చించలేదని ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకవైపు పార్లమెంటు సమావేశాలు సీరియస్‌గా జరుగుతున్నాయని, మరోవైపు అసెంబ్లీ సమావేశాలూ కొనసా గుతున్నాయని గుర్తుచేశారు. మంత్రివర్గ విస్తరణపై చర్చల్లో పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి కూడా ఉంటారని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, అశ్వినీవైష్ణవ్‌లను కలవడానికి పార్లమెంటుకు వచ్చినప్పుడు లాబీల్లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ వారు అడిగిన ప్రశ్నలకు స్పందించారు. లగచర్ల రైతుకు పోలీసులు బేడీలు వేయడాన్ని రేవంత్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఆ విషయం తెలిసిన వెంటనే తాను అధికారులకు ఫోన్ చేసి వివరాలు కనుక్కొన్నట్లు తెలిపారు. ఆ రైతుపై కొందరు పోలీసులు తీవ్ర నేరాలతో కూడిన కేసులు నమోదుచేసి చూపినట్లు తెలిసిందని, అందుకే వెంటనే ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలకంటే ముందు తానే స్పందించినట్లు గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో తాము అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే ముందుకెళ్లామని, తాజా రూపంలో ప్రతి ఒక్కరూ తమ అమ్మను చూసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రానికి వరి, మొక్కజొన్న, సజ్జ, జొన్న పంటలు ప్రధానమైనవి కాబట్టే తెలంగాణతల్లి చేతిలో ఆ నాలుగింటినీ ఉంచినట్లు చెప్పారు. ప్రస్తుత రూపాన్ని ఒక్క భారాస తప్పితే ఎవ్వరూ వ్యతిరేకించడంలేదన్నారు.

## ముందు రేవంత్ సోదరులనే

# అరెస్టు చేయాలి

**హరీశ్‌రావు ధ్వజం**




**హైదరాబాద్:** జాతీయ అవార్డు విజేత అల్లు అర్జున్ అరెస్టును అరెస్టును బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అసలు బెన్‌ఫిట్ షోలకు అనుమతి ఇచ్చింది ఎవరు.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా సినిమా ప్రదర్శించింది ఎవరు అని ప్రశ్నించారు. సినిమా కోసం వెళ్లి తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని హరీశ్‌రావు అన్నారు. దీనికి అసలు కారకులు, రాష్ట్ర పాలకులే అని తెలిపారు. చర్యలు తీసుకోవాల్సింది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పైనే అని ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి బ్రదర్స్ వేధింపుల వల్లే చనిపోతున్నా అని సూసైడ్ లెటర్ రాసి సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్య చేసుకుంటే రేవంత్ బ్రదర్స్‌ను ఎందుకు అరెస్టులు చేయరని ప్రశ్నించారు. రేషన్ కార్డు నిబంధనల వల్లే, రుణమాఫీ కాక ఆత్మహత్య చేసుకుంటున్నా అని సూసైడ్ లెటర్ రాసి మేడ్చల్ వ్యవసాయ కార్యాలయం వద్ద సురేందర్ రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకుంటే కారకుడైన రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్టు చేయరని నిలదీశారు. అరెస్టు చేయాల్సి వస్తే ముందు రేవంత్ రెడ్డి సోదరులను అరెస్టు చేయాలని అన్నారు. ఏడాది పాలనలో రైతులను బలిగొన్నందుకు ఎవరిని అరెస్టు చేయాలి? ఫుడ్ పాయిజన్లతో 49 మంది విద్యార్థులు చనిపోయారు. దీనికి ఎవరిని అరెస్టు చేయాలి? ఫార్మా సిటీ పేరుతో లగచర్ల గిరిజన బతుకులను ఛిద్రం చేశారు. దీనికి ఎవరిని అరెస్టు చేయాలి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. చట్టం అల్లు అర్జున్ విషయంలోనే కాదు ఎనుముల రేవంత్ రెడ్డి అండ్ బ్రదర్స్ విషయంలోనూ స్పందించాలని డిమాండ్ చేశారు. చట్టం ఎవ్వరికీ చుట్టం కాకూడదని వ్యాఖ్యానించారు.

## భారత రాజ్యాంగం

# ప్రతీ పౌరుడికి దిక్సూచి

**రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 13 :** భారతరాజ్యాంగం ప్రతి పౌరుడికి ఒక దిక్సూచి అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక చర్చ జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా లోక్‌సభలో శుక్రవారం ఉదయం జీరో అవర్ ముగిసిన తర్వాత చర్చ ప్రారంభమైంది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిగువ సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశాన్ని ఐక్యంగా, ప్రజాస్వామ్యంగా, స్వావలంబనగా ఉంచేందుకు రాజ్యాంగం ఓ రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుందని తెలిపారు. అయితే, ప్రతిపక్షాలు అనేక సందర్భాల్లో రాజ్యాంగాన్ని అవమానించాయని మండిపడ్డారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని అనేక కీలక పథకాలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కాగా, శనివారం వరకూ ఈ చర్చ కొనసాగుతుంది. సభ్యులు దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇక చర్చకు ముగింపుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు సమాధానం ఇవ్వనున్నారు.

# ప్రార్థనా స్థలాల చట్టంపై పదే పదే చర్చ ఎందుకు?

భారతదేశం లౌకిక దేశం. పౌరులు స్వేచ్ఛగా తమ మతాలను ఆచరించవచ్చు. మత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటం ప్రభుత్వాల విధి. అలాగే మతం ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు. ఇక, మత స్వేచ్ఛకు సంబంధించిన ఎన్నో చట్టాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనది ప్రార్థనా స్థలాల చట్టం. 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు అస్థిత్వంలో ఉన్న మతపరమైన కట్టడాలు. వాటి గుర్తింపు, స్వభావాన్ని, నిర్మాణాన్ని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టం ఇది. మతపరమైన కట్టడాలు అంటే అవి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారా లు...ఏవైనా కావచ్చు, 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు వాటి స్వరూపం ఎలా ఉందో అలాగే కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామ మంది రం నిర్మించాలని బీజేపీ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమం బలం పుంజుకోవడంతో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో 'ది ప్లేస్ ఆఫ్ వర్షిప్ (స్పెషల్ ప్రొవిజన్స్)' చట్టం తీసుకొచ్చింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ దీనిని గట్టిగా వ్యతిరేకించింది. 1991లో అమల్లోకి వచ్చిన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు వాటిని విచారిస్తోంది. కాగా, మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను



స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు తాజాగా ఆదేశిం చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధన లను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ప్రార్థనా స్థలాల చట్టం1991 మీద దాఖలైన పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు చెప్పబోయే తీర్పు మీద దేశంలో ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న డజన్ల కొద్దీ ప్రార్థనాలయాల భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇందులో ఎక్కువ భాగం కట్టడాలు ముస్లింలకు చెందినవి. వీటి మీద హిందూ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. కోర్టు కేసుల్లో చిక్కుకున్న వాటిలో జ్ఞానవాపి, షాహి ఈద్గా, వారణాసి, మధురలోని రెండు వివాదాస్పద మసీదులు ఉన్నాయి. రెండు వారాల కిందట అజ్మీర్ దర్గా విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అజ్మీర్‌లో ప్రతిరోజూ వేలమంది సందర్శించే 13వ శతాబ్దానికి చెందిన ఈ సూఫీ మందిరాన్ని హిందూ ఆలయం మీద నిర్మించారని కోర్టులో పిటిషన్ దాఖలైంది. నెల రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ 16వ శతాబ్దానికి చెందిన మసీదులో సర్వే నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో హింస చెలరేగింది. ఇందులో నలుగురు మరణించారు. సర్వే నిర్వహించాలన్న కోర్టు నిర్ణయంపై ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కోర్టులు సర్వేకు ఆదేశాలు జారీ చేసినప్పుడల్లా ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే జరిగింది. 17వ శతాబ్దంలో కాశీ విశ్వనాధుడి ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మసీదు నిర్మించారని హిందూ సంఘాలు ఆరోపించాయి. జ్ఞానవాపి మసీదులో సర్వే నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలను ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. ఇది 1991 ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమనేది వారి వాదన.

అయితే 2022లో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ సర్వేను ఆపాలని చెప్పలేదు. 1947 ఆగస్టు 15నాటికి ఉన్నప్రార్థనాలయాల స్వభావాన్ని మార్చడానికి ప్రయత్నించనంత వరకు, వాటిపై దర్యాప్తును 1991 చట్టం నిరోధించలేదని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. ఈ ఉత్తర్వులను అనేక మంది విమర్శించారు. వివిధ ఆరోపణల వల్ల స్థలాల చారిత్రక స్థితిని నిర్ణయించడం అనేది మతాల మధ్య ఘర్షణలను, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చట్టాన్ని తొలగించినా లేక బలహీనపరిచినా అది ఇలాంటి అనేక పిటిషన్లకు గేట్లు తెరవడం లాంటిదేనని ప్రతిపక్ష నాయకులు, ముస్లిం సంఘాల నేతలు భావిస్తున్నారు. దీని వల్ల దేశంలో హిందువులు, ముస్లింల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని అంటున్నారు.

# మహా పాదయాత్రతో శబరికి వెళ్లి వచ్చిన గురుస్వాములకు ఘన సన్మానం

## గురుస్వామి కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో..

**కీసర, డిసెంబర్ 13 (నేటి ప్రస్థానం) :** మహా పాదయాత్ర తో శబరి వెళ్లిన స్వాములు అయ్యప్ప నామస్మరణంతో మండల పూజలో మణికంఠ స్వామిని దర్శించుకొని క్షేమంగా నగరానికి తిరిగి వచ్చారు.నాగారం మున్సిపాలిటీ శ్రీ విఘ్నేశ్వర ఇన్ ఫ్రా డెవలపర్స్ గురుస్వామి కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శబరిమల మహాపాదయాత్రకు 41 రోజులు ముగించుకొని క్షేమంగా నగరానికి తిరిగి రావడం అభినందన నియమని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి అన్నారు.శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీహరిహర రామాంజనేయ స్వామి దేవస్థానంలో కౌకుట్ల ప్రభాకర్ రెడ్డి,దాసరి వెంకట్ రెడ్డి





గురుస్వాములకు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడూరు ఆంజనేయులు గౌడ్,శివ కార్తీక్ శాస్త్రి,మాదిరెడ్డి గోవర్ధన్ రెడ్డి,కౌకుట్ల శ్రీకాంత్ రెడ్డి,శౌకత్ అలీ,కౌకుట్ల సాయికిరణ్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,గొప్ప సంతోష్ రెడ్డి, భాస్కర్,వంశీ,విగ్నేష్, రత్నారెడ్డి,పవన్, వెంకటేష్,ఉదయ్ కిరణ్ రెడ్డి,దాసరి శశికాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర విజన్-2047 ఆవిష్కరణ

**అమరావతి, డిసెంబర్ 13 :** స్వర్ణాంధ్ర విజన్–2047 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇందిరా గాంధీ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. పెద్దఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరయ్యారు. అంతకుముందు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో స్వర్ణాంధ్ర ఏ 2047 పై ఏర్పాటు చేసిన స్టాల్‌లను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు సందర్శించారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాలు.. పేదరికంలేని సమృద్ధికరమైన అవకాశాలు అందించే అద్భుత ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలకు నైపుణ్యాలకు కేంద్రంగా రానున్న రోజుల్లో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఆవిష్కృతమయ్యేలా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చి దిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం రూపొందించిన పది సూత్రాలు స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు. పేదరికం లేని సమాజం, ప్రతి కుటుంబానికి అవసరమైన వనరులు సమకూర్చడం, ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ఈ సూత్రం ప్రధాన లక్ష్యం. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్.. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ముఖ్య ఉద్దేశం. ఉద్యోగ, ఉపాధి కల్పనతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసేలా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు – వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి మరియు ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాలలో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశలలో సమగ్ర సాంకేతికత వంటి 10 సూత్రాలతో విజన్ 2047 రూపొందించారు. స్వచ్ఛాంధ్ర స్టాల్ వద్ద సీఎం చంద్రబాబు ఛలోక్తులు విసిరారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన ఆలోచనలు ఉండాలని సూచించారు. పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారంటూ విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. మహిళా రైతులతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఆర్థికాభివృద్ధికి అందుతున్న తోడ్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్‌ను 10సూత్రాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర విజన్



డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఆక్వా ఉత్పత్తుల రవాణాలో ఇబ్బందులు పరిష్కరించాలని ఆక్వా రైతులు కోరారు. మహిళా ఆర్థికాభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటామని డ్వాక్రా మహిళ సుహాసిని అన్నారు. 2047 నాటికి ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజన్ స్వర్ధాంధ్ర 2047పై ప్రత్యేక వీడియో విడుదల చేశారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..**

స్వర్ణాంధ్ర విజన్–2047 కార్యక్రమానికి శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రజలు, అధికారులు తరలివచ్చిన నేపథ్యంలో విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. విజయవాడలోకి భారీ వాహనాలు రాకుండా నగరం వెలుపల నుంచే వాటి రాకపోకలను నియంత్రించనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలను హనుమాన్ జంక్షన్, గుడివాడ, పామర్రు అవనిగడ్డ మీదుగా మళ్లించనున్నట్లు చెప్పారు. చెన్నై– హైదరాబాద్ వెళ్లే వాహనాలను మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, నల్గొండ మీదుగా హైదరాబాద్‌కు మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.




# వైసీపీ నాయకుడు అవినాష్‌రెడ్డి అరెస్టు

**అమరావతి,డిసెంబర్ 13 :** కడప పార్లమెంట్ సభ్యుడు, వైసీపీ నాయకుడు అవినాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాలలో వైసీపీకి చెందిన రైతులకు నో డ్యూస్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రైతులతో పాటు అవినాష్ రెడ్డి వేముల తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ అప్పటికే టీడీపీకి చెందిన రైతులు ఉండడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముందుజాగ్రత్తగా పోలీసులు అవినాష్ రెడ్డిఅదుపులోకి తీసుకొని వేముల పోలీస్‌స్టేషన్‌కు అక్కడి నుంచి పులివెందులకు తరలించారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్న రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని భావించి రైతులకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయడానికి వస్తే పరాభవం ఎదురవుతుందనే భయంతో పోలీసులను అడ్డుపెట్టుకుని దద్దమ్మ రాజకీయాలు ఆడడం సిగ్గుగా లేదాని ప్రశ్నించారు. అధికారులను అడ్డం పెట్టుకొని తప్పుడు రాజకీయాలు చేయడం క్షమించరాని తప్పని పేర్కొన్నారు . ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేకపోతే సాగునీటి సంఘాలకు నామినేటెడ్ పదవుల మాదిరి చేసుకుంటే సరిపోయేదని. ఈ మాత్రం దానికి ఎన్నికలని పేరు పెట్టడం దేనికని ప్రశ్నించారు. ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని వెల్లడించారు.

# ఫోన్ లాక్కున్నందుకు కత్తితో పొడిచిన స్టూడెంట్


**లక్నో, డిసెంబర్ 13 :** కాలేజీకి మొబైల్ ఫోన్లు తెచ్చిన విద్యార్థుల నుంచి టీచర్ వాటిని స్వాధీనం చేసుకున్నాడు. ఒక జూనియర్ ఇంటర్ విద్యార్థి దీనిపై కక్షగట్టాడు. మూడు రోజుల తర్వాత కత్తితో దాడి చేసి ఆ టీచర్‌ను పొడిచాడు. తీవ్రంగా గాయపడిన ఆయన మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మిహిన్‌పూర్వాలోని నవయుగ్ ఇంటర్ కాలేజీలో మొబైల్ ఫోన్లు నిషేధించారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట ఇంగ్లీష్ టీచర్ రాజేంద్రప్రసాద్ క్లాస్‌లో విద్యార్థులను చెక్ చేశాడు. మొబైల్ ఫోన్లు తెచ్చిన వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్లను ఆ విద్యార్థులకు తిరిగి ఇచ్చేశాడు. కాగా, ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ చర్యపై కొందరు విద్యార్థులు ఆగ్రహించారు. గురువారం ఒక స్టూడెంట్ క్లాస్‌లో ఆ టీచర్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆ టీచర్‌ను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. మరోవైపు తనను కత్తితో పొడిచిన విద్యార్థికి మరో ఇద్దరు సహకరించినట్లు ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ ఆరోపించాడు. ఆయన కుటుంబం ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థి దాడికి వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మిగతా ఇద్దరు విద్యార్థుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# తమిళనాడులో అగ్నిప్రమాదం

## ఏడుగురు మృతి

**చెన్నై, డిసెంబర్ 13:** తమిళనాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. దిండిగల్ జిల్లా గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఆసుపత్రిలో చిక్కుకుపోయిన రోగులను రక్షించి ఇతర ఆసుపత్రులకు తరలించారు. పొగ కారణంగా స్పృహ కోల్పోయిన కొందరు సిబ్బందిని సైతం రక్షించి చికిత్స నిమిత్తం వేరే ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఓ బాలుడు కూడా ఉన్నట్లు తెలిసింది. మెడికల్ ఫెసిలిటీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# స్వామివారిని దర్శనానికి 24 గంటల సమయం

**తిరుమల, డిసెంబర్ 13 :** కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా 21 కంపార్టుమెంట్లలో స్వామివారి దర్శనానికి వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులు దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న స్వామివారిని 61,178 మంది భక్తులు దర్శించుకోగా 22,464 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.85 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక





# సుందర్ గబ్బా టెస్ట్ ఆడేనా?

బ్రిస్బేన్ టెస్టు కోసం ఆస్ట్రేలియా తన ప్లేయింగ్ ఎలెవన్‌ని ఖరారు చేసింది. అయితే, టీమ్ ఇండియా ఏలాంటి ప్లేయింగ్ 11తో మైదానంలోకి రానుందో ఆసక్తిగా మారింది. ఈ క్రమంలో ఓ ఫొటోతో ఈ అంచనాలకు తెర దింపినట్లైంది. తాజాగా బయటకు వచ్చిన ఓ ఫొటోతో ప్లేయింగ్ 11పై ఓ క్లారిటీ వచ్చేసింది. వాషింగ్టన్ సుందర్ షేర్ చేసిన ఫొటో కారణంగా గబ్బా టెస్టు కోసం టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్ గురించి ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, భారత స్పిన్ ఆల్ రౌండర్ సుందర్ ఎలాంటి ఫొటోను ప్రపంచానికి అందించాడు? అతను తన %శ% హ్యాండిల్‌తో పాటు మరో 3 ఫొటోలను పోస్ట్ చేశాడు. అందులో 14 డిసెంబర్ 2024, బ్రిస్బేన్. సుందర్ ఈ పోస్ట్‌కి క్యాప్షన్‌ని ఒకే పదంలో రాశాడు. వాషింగ్టన్ సుందర్ షేర్ చేసిన ఫొటో గబ్బా టెస్ట్ కోసం టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో అతనిని చేర్చడానికి సూచనగా మారింది. భారత జట్టులో అశ్విన్ స్థానంలో సుందర్‌కు అవకాశం కల్పించవచ్చు. ఇక్కడ ఆడిన చివరి టెస్టులో భారత్ విజయంలో అతని పాత్ర నిర్ణయాత్మకమైనందున భారత జట్టు మేనేజ్‌మెంట్ దీన్ని చేయాలని ఆలోచిస్తుండవచ్చు. 2 ఇన్నింగ్స్‌లలో 84 పరుగులు చేయడం ద్వారా, పంత్, గిల్ తర్వాత అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. జట్టులోని మిగతా ఆటగాళ్ల విషయానికొస్తే, గబ్బా పిచ్ స్వభావాన్ని బట్టి చూస్తే, అందులో ఎలాంటి మార్పులకు అవకాశం లేదు. అంటే, బ్యాటింగ్, ఫాస్ట్ బౌలింగ్‌లో ఏదైనా మార్పు వచ్చే అవకాశాలు తక్కువ. అడిలైడ్‌లో ఆడిన ఆటగాళ్లే అక్కడ కూడా ఆడుతున్నారు.




## బంతిని చూసి బాదడమే ఇప్పటి జనరేషన్

### టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్

ప్రత్యర్థి బౌలర్ ఎవరా? అనేది తమ జనరేషన్ బ్యాటర్లకు అనవసరమని, బంతిని చూసి బాదడమే తమకు తెలుసని టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. తొలి రెండు టెస్ట్‌ల్లో ఇరు జట్లు చెరో విజయం సాధించడంతో సిరీస్ 1-1తో సమంగా నిలిచింది. దాంతో గబ్బా టెస్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఈ మ్యాచ్ ప్రిపరేషన్స్‌ను టీమిండియా పూర్తి చేసుకుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శుభ్‌మన్ గిల్ పాల్గొన్నాడు. తమ ప్రిపరేషన్స్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని తాము తాజాగా ప్రారంభిస్తామని, మూడు టెస్ట్‌ల సిరీస్‌గా భావించి ఆడుతామని చెప్పాడు. 'ఒక్కసారి కూడా గెలవకపోతే బాధపడాలి. కానీ గత పర్యటనలో మేం ఇక్కడ విజయం సాధించాం. భారత గడ్డపై అదే జోరు కొనసాగించాం. ప్రత్యర్థి బౌలర్ ఎవరా? అనేది ఈ జనరేషన్‌కు అనవసరం. బంతిని చూసి ఆడటమే తెలుసు. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్ అంతా బాగుంది. జట్టంతా కలిసి డిన్నర్ చేశాం. ఎంతో సరదాగా గడిపాం. అడిలైడ్‌లో మేం ఆశించిన ఫలితం దక్కలేదు. అయితే ఈ పరాజయంతో ఆందోళన పడటం లేదు. ఇక నుంచి మూడు టెస్ట్‌ల సిరీస్‌గా భావించి ఆడుతాం. గబ్బా టెస్ట్‌లో గెలిస్తే.. మెల్‌బోర్న్, సిడ్నీలోనూ పైచేయి సాధిస్తాం. గత సిరీస్‌లోనూ అడిలైడ్‌లో మాకు ఓ పరాజయం ఎదురైంది. కానీ ఆ తర్వాత మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకున్నాం. ఇప్పుడూ కూడా అదే సానుకూల దృక్పథంతో బరిలోకి దిగుతాం. గబ్బాలో మాకు మెరుగైన రికార్డ్ ఉంది. ఇక్కడికి రాగానే మైదానం మొత్తం తిరిగాం. ఇక్కడ మంచి జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ పిచ్ కూడా బాగుంటుంది.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. వరల్డ్ చెస్ ఛాంపియన్ టైటిల్ గెలిచిన దొమ్మరాజు గుకేశ్‌కు టీమిండియా తరఫున శుభ్‌మన్ గిల్ అభినందనలు తెలిపాడు. అతి చిన్న వయసులోనే వరల్డ్ చెస్ ఛాంపియన్ గెలవడం దేశానికే గర్వకారణమని కొనియాడాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్‌లో శుభారంభం చేసిన టీమిండియా.. ఆ జోరును మాత్రం కొనసాగించలేకపోయింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో 295 పరుగుల తేడాతో గెలిచిన టీమిండియా.. అడిలైడ్‌లో మాత్రం 10 వికెట్ల తేడాతో చిత్తయ్యింది.



## యువ ఛాంపియన్ గుకేశ్‌కు తమిళనాడు సీఎం రూ.5కోట్ల నజరానా

చిన్న వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన భారత ఆటగాడు డి గుకేశ్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భారీ నజరానా ప్రకటించారు. వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డిగ్ లిరెన్‌పై గుకేశ్ అద్భుత విజయం సాధించడంపై స్టాలిన్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 కోట్ల ప్రైజ్‌మనీని అందిస్తున్నట్లు వెల్లడించారు. 'గుకేశ్ సాధించిన అద్భుత విజయాన్ని మనం గౌరవించాలి. అతి పిన్న వయస్కుడైన ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సంతోషంలో అతడికి రూ. 5 కోట్ల ప్రైజ్ మనీని ప్రకటిస్తున్నా. జాతి గర్వపడేలా చేసిన అతడికి నా ప్రత్యేక అభినందనలు. మున్ముందూ మరిన్ని ఘనతలు సాధించాలని కోరుకుంటున్నా. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షిస్తున్నా" అని స్టాలిన్ పోస్టు చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన దొమ్మరాజు గుకేశ్‌కు ట్రోఫీతో పాటు రూ. 11.45 కోట్ల నగదు బహుమతి దక్కింది. దీంతో అతడి నికర విలువ రూ. 8.26 కోట్ల నుంచి రూ. 21 కోట్లకు పెరిగింది. చెస్ ద్వారా అతడి ఆదాయం దాదాపు మూడు రెట్లు పెరిగినట్లైందని ఔట్‌లుక్ పేర్కొంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన లిరెన్ రూ. 9.75 కోట్లు గెలుచుకున్నాడు. ఈ ఛాంపియన్‌షిప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 21.17 కోట్లు. ఒక గేమ్ గెలిచిన ప్లేయర్‌కి రూ. 1.69 కోట్లు లభిస్తాయి. మూడు గేమ్‌లు నెగ్గిన గుకేశ్‌కు రూ. 5.07 కోట్లు.. రెండు గెలిచిన లిరెన్‌కు రూ. 3.38 కోట్లు దక్కాయి. మిగిలిన ప్రైజ్‌మనీని సమానంగా పంచారు.

## కమిన్స్ టీమిండియాను భయపెట్టే ప్రయత్నం




నేటి నుంచి బ్రిస్బేన్‌లో భారత్-ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు జరగనుంది. ఈ మైదానం ఆస్ట్రేలియా యొక్క బలమైన కోటగా పరిగణించబడుతుంది. గతసారి ఇదే మైదానంలో భారత జట్టు విజయం సాధించింది. బ్రిస్బేన్‌లో జరగనున్న మ్యాచ్‌కు ముందు కమిన్స్ టీమిండియాను భయపెట్టే ప్రయత్నం చేశాడు. భారత్ - ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు ప్రారంభం కావడానికి మరికొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. బ్రిస్బేన్‌లో జరగనున్న ఈ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ టీమిండియాతో మైండ్ గేమ్‌లు ఆడడం ప్రారంభించాడు. అతను తన జట్టులో ఫాంలోలేని స్టీవ్ స్మిత్ పేరును తీసుకొని భారత జట్టును భయపెట్టడానికి ప్రయత్నించాడు. నిరంతరాయంగా ఫ్లాప్ అవుతున్న స్మిత్ గురించి, కమిన్స్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడని, త్వరలో భారీ ఇన్నింగ్స్ చూడవచ్చంటూ చెప్పుకొ చ్చాడు. ఇంతలో స్మిత్ గురించి రహస్యం కూడా వెలుగులోకి వచ్చింది. స్టీవ్ స్మిత్ గత కొంతకాలంగా ఫామ్‌లో లేడు. పరుగుల కోసం వెతుకుతున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కూడా అతను 3 ఇన్నింగ్స్‌లలో 6 సగటుతో 19 పరుగులు మాత్రమే చేయగ లిగాడు. గత 10 టెస్టు ఇన్నింగ్స్‌ల్లో 17.91 సగటుతో 179 పరుగులు చేశాడు. అడిలైడ్ టెస్టులో, అతను 2 పరుగులు చేసిన తర్వాత జస్ప్రీత్ బుమ్రాకు బలి అయ్యాడు. అయినప్పటికీ, నెట్ ప్రాక్టీస్ సమయంలో స్మిత్ చాలా షార్ప్‌గా కనిపిస్తున్నాడని కమిన్స్ చెప్పాడు. అతనికి చాలా సమయం ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే, చాలాసార్లు ఆస్ట్రేలియా ఆటగాళ్లు ప్రత్యర్థి జట్లపై ఇలాంటి మెంటల్ ట్రిక్స్ ప్రయోగిస్తూనే ఉంటారు. అయితే, ఇది నిజం కూడా కావచ్చు. ఎందుకంటే ఈలోగా స్మిత్ తన బ్యాటింగ్ విషయంలో దిగ్గజ ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ మైఖేల్ హస్సీ నుంచి సలహా కోరినట్లు కూడా వెల్లడైంది. స్టీవ్ స్మిత్ తన ఫామ్ గురించి ఆందోళన చెందుతున్నాడు. దీనికి సంబంధించి, అతను అడిలైడ్ టెస్టుకు ముందు మైఖేల్ హస్సీని కలిశాడు. ఈ కాలంలో తక్కువ ప్రాక్టీస్ చేయాలని స్మిత్‌కు హస్సీ సూచించాడు. మార్నస్ లాబుషాగ్నే, స్టీవ్ స్మిత్ నెట్స్‌లో చాలా ప్రాక్టీస్ చేస్తారని హస్సీ చెప్పాడు. అయితే, వయసు పెరిగే కొద్దీ ఆటగాళ్లు తక్కువ ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. 35 ఏళ్ల స్మిత్ ప్రస్తుతం శిక్షణ కంటే మానసి కంగా, శారీరకంగా తాజాగా ఉండాల్సిన అవసరం ఉం దని మైఖేల్ హస్సీ అభిప్రాయపడ్డాడు. హస్సీ ప్రకారం, అతను స్మిత్‌కు అదే సలహా ఇచ్చాడు. రెండో టెస్టులో అతని సలహాను అనుస రించి, స్మిత్ కొన్ని సెషన్లను వదిలేశాడు. కానీ ప్రయోజనం కనిపిం చలేదు. అయితే కమిన్స్ మాటలు నిజంగా నిజమైతే మాత్రం టీ మిండియాకు ఆందోళన కలిగించే విషయమే. స్మిత్ ఫామ్‌లో ఉ ంటే ఔట్ కాకుండా భారీ స్కోర్లు చేసే బ్యాట్స్‌మెన్ అని తెలిసిందే.



## ఆఖరి వన్డేలో వెస్టిండీస్ ఘన విజయం

### నాలుగు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం

సెయింట్ కిట్స్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఆఖరి వన్డేలో వెస్టిండీస్ నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 2014 తర్వాత బంగ్లాదేశ్‌పై వన్డే సిరీస్ గెలిచిన విండీస్.. మూడో వన్డేలో రికార్డు ఛేజింగ్ చేసింది. సెయింట్స్ కిట్స్ వేదికలో ఇదే అత్యుత్తమ ఛేదన. అంతేగాక వన్డే ఫార్మాట్‌లో వెస్టిండీస్ ఇదే అత్యుత్తమ మూడో ఛేదన. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు విండీస్ వరుసగా 11 వన్డేలు ఓడిపోవడం గమనార్హం. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో అయిదు వికెట్లకు 321 పరుగులు చేసింది. మహ్మదుల్లా (84 నాటౌట్‌బీ 63 బంతుల్లో, 7 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ (77బీ 73 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్సర్లు), సౌమ్య సర్కార్ (73బీ 73 బంతుల్లో, 6 ఫోర్లు, 4 సిక్సర్లు), జేకర్ అలీ (62 నాటౌట్‌బీ 57 బంతుల్లో, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ రెండు వికెట్లు, మొటియ్, రూథర్‌ఫర్డ్ తలో వికెట్ తీశారు. అయితే బంగ్లాదేశ్ 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.

## అంజింక్యా రహానే విధ్వంసకర బ్యాటింగ్

ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై ఫైనల్ చేరింది. బరోడాతో శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ముంబై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టీమిండియా వెటరన్ బ్యాటర్ అంజింక్యా రహానే(56 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98) విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బరోడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు చేసింది. శశ్వాత్ రావత్(29 బంతుల్లో 4 ఫోర్లతో 33), కృనాల్ పాండ్యా(24 బంతుల్లో 4 ఫోర్లతో 30), శివాలిక్ శర్మ(24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36 నాటౌట్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ముంబై బౌలర్లలో మోహిత్ అవస్థీ, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, తనూష్ కోటియన్, అథర్వ అంకోలేకర్ తలో వికెట్ తీయగా.. సుయాన్ష్ షెడ్గే రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన ముంబై 17.2 ఓవర్లలో 4 వికెట్లకు 164 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ పృథ్వీ షా(8) విఫలమవ్వగా.. అజింక్యా రహానే, శ్రేయస్ అయ్యర్(30 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) రాణించారు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ ముంగిట అయ్యర్ ఔటవ్వగా.. అజింక్యా రహానే శతకాన్ని చేజార్చుకున్నాడు. సుర్యాన్ష్ షెడ్గే విన్నింగ్ సిక్స్‌తో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

